# ఎల్లావు-ఎల్లమంద

రంగయ్యగారి ఎల్లావు తొలి చూలు నిండి కోడె దూడను పెట్టింది.

ఆరోజు ఇల్లంతా పండగలా హడావిడిగా వుంది. రెండు రోజులు ఎల్లావు ఇంటిదగ్గరే వుంది.

మూడో రోజు చిన జీతగాడు ఎల్లావును మిగతా గొడ్లతోపాటు బీట్లో మేపుకొని రావడానికి వదిలాడు.

తొలి ఈత బిడ్డమీద మమత తీరని ఎల్లావు, దూడను వదిలి వెళ్ళలేక, చావిట్లోకి దొడ్లోకి కదం తొక్కుతూ మారాం చేసింది.

కాని జీతగాడు తనను వదిలి వెళ్ళడని తెలుసుకొన్నాక అన్ని గొడ్లకంటే ముందుగా బీట్లోకి నడిచింది.

పొద్దు వాటాలింది.

గొడ్లకాడ బుడ్డోడు బీడుకు అల్లంత దూరానవున్న నల్లచెరువులోకి పశువుల్ని తోలి, చెరువు గట్టుమీద చింతచెట్టుకింద బాచీపెట్లు వేసుక్కూర్చుని అన్నం మూట విప్పాడు. కొరివికారం పచ్చడితో కలిపిన అన్నం ముద్దల్ని గబగబా ఉసిళ్ళు తోలుతూ తినడంలో మునిగిపోయాడు జీతగాడు.

చెర్లో దిగి, నీళ్ళు తాగి, చల్లని నీటిలో తుళ్ళుతూ, పొర్లుతూ, జలకాలాడుతున్న ఎల్లావుకు దూడ గుర్తొచ్చింది.

పొదుగు జివ జివలాడింది.

అంతే!

అక్కడ లేచిన ఎల్లావు, చెరువుకట్ట దూకి, పుట్ట దాటి, డొంక వదలి, మాగాటి చేలకు అడ్డం పడింది.

గుండెల్లో బిడ్డమీది మమకారం మసులుతోంటే, జివ జివలాడుతోన్న పొదుగులో పాలు కదులుతోంటే, మెడకింద గంగడోలు అల్లల్లాడుతోంటే, పట్టుకుచ్చుల తోక పైకెత్తి, మోరచాచి, ఉరకలు వేస్తూ, నురగలు కక్కుతూ, చెంగు చెంగున పరుగులు వేస్తూన్న ఎల్లావుకు, ఈనకాచిన పిల్లిపెసరచేను తన గిట్టలకింద నలిగిపోతుందన్న సంగతి తెలియదు- బాణాక్రరతో ఎల్లమంద ఎదురునిల్చి నడిచేలో నిలేసేదాకా!

గుండెలు పగిలిన పసిబిడ్డతల్లి రివ్వున వెనక్కు మళ్ళింది. మళ్ళీ పరుగు లంకించుకొనేలోపున ఎల్లమంద చేతుల్లో వున్న పలుపు ఎల్లావు మెడకు చుట్టుకుపోయింది.

పల్లపుసాగు సన్న రైతు ఎల్లమందకు ఎగువసాగు మోతుబరి రైతు రంగయ్య అంటే మహాకసి. చేను తడిచే నీళ్ళు అందినా, కిందటేడు ఆసామి రంగయ్య చప్పున నీళ్లు వదలలేదని అగ్గిబుగ్గయిపోయాడు. రంగయ్యమీద కసి తీర్చుకొనే అదను దొరక్క మరీ మండిపోతున్నాడు లోలోపలే.

తన పంట చేనుకు అడ్డంపడి అల్లిబిల్లి తిరుగుతున్న రంగయ్యగారి ఎల్లావును చూసేసరికి యల్లమందకు అరికాలి మంట నెత్తికెక్కినట్లయింది యల్లమంద ఎల్లావును దొరకపుచ్చుకున్నాడు.

ఇంతకాలానికి చిక్కాడు రంగయ్య తన చేతిలో! దొరికిన అదను పోగొట్టుకోకూడదు! ఆవును బందెలదొడ్లో పెట్టేస్తే సరి!

ఉన్న ఊళ్ళో పాడి ఆవును బందెలదొడ్లో పెట్టిస్తే నలుగురూ చివాట్లు వేస్తారని భయపడ్డాడు ఎల్లమంద. ఆలోచించి కోసెడు దూరానవున్న గోపాలపురం తోలుకెళ్లి, ఎల్లావును బందెల దొడ్లో పెట్టించి హాయిగా గాలి పీల్చుకున్నాడు. ఏదో ఘనకార్యం చేసినవాడిలా చాతీ విరుచుకుంటూ, భుజాలు ఎగరేసుకుంటూ మీసాలు దువ్వుకుంటూ తిరిగి ఊళ్ళోకి వచ్చాడు. కొంచెం దూరం అయినా చుట్టూ తిరిగి రంగయ్య ఇంటిముందునుంచి వెళ్ళాడు. రంగయ్య దొడ్లోనుంచి వస్తున్న "అంబా!" అనే లేగదూడ అరుపులు ఆనందాన్ని కలిగించాయ్.

ఎల్లమంద ఇంటికి చేరేసరికి ఊరు మాటుమణిగింది.

తడికతోసి, గడప దాటుతోన్న ఎల్లమందను చూడగానే మూడునెల్ల పసిగుడ్డును వళ్ళో పెట్టుకుని కునుకు తీస్తోన్న ముసల్ది బావురుమంది.

బిడ్డ మధ్యాహ్నంనుంచి మూసినకన్ను తెరవలేదు. వళ్లు తెలియని జ్వరంలో మధ్య మధ్య ఉలిక్కిపడుతున్నాడు.

భార్య ప్రసవించిన మూడో రోజున పసికందును ఎల్లమంద చేతుల్లోపెట్టి కళ్ళుమూసింది.

అప్పటినుంచి నాయనమ్మ చేతుల్లో, ఎల్లమంద కనురెప్పలకింద ఆప్యాయంగా సాకబడుతోన్న బిడ్డకు అమాంతంగా జ్వరం ముంచుకొచ్చింది.

భుజాన కండువా అన్నా వేసుకోకుండా ఎల్లమంద అనంతాచార్యులవారి దగ్గరకు పరుగెత్తాడు.

అనంతమైన వ్యాధులకూ, ఆ పొట్లాలమందే ఇచ్చే అనంతాచార్యులవారు బిడ్డ నాడి పరీక్షించాడు. నాడి చూస్తూ గంభీరంగా తల ఆడించాడు. ఆత్రంగా ఎల్లమంద ఆచార్యులవారి ఆడుతున్న తలను చూస్తూ నిలబడ్డాడు.

గుడ్డసంచి విప్పి తెల్లపొడిని మూడు చిన్న పొట్లాలు కట్టి ఎల్లమందకు అందించాడు.

"బిడ్డ పరిస్థితి గడ్డుగానే వుంది!"

ఆచారి మాటలకు ఎల్లమంద నిలువెల్లా వణికిపోయాడు.

"భయపడకు, ప్రతి మూడు గంటలకూ అర ఔన్సు ఆవుపాలలో రంగరించి పోయండి. ఈ రాత్రి గడిస్తే ప్రాణభయం లేదు. పొద్దున్నే వచ్చి ఎలా వుందో చెప్పు!" అంటూ ఆచార్యులవారు వేగంగా నడిచి వెళ్ళిపోయాడు.

ఎల్లమంద రెండు క్షణాలు కొయ్యబారిపోయి నిల్చుండిపోయాడు. తన బిడ్డకు ఈ రాత్రి గడవాలా? గడవకపోతే? నిలువునా నీరయిపోయాడు.

ఎల్లమంద బుడ్డిచెంబు తీసుకొని ఊరిమీద పడ్డాడు ఆవుపాలకోసం. ఆవులున్న ఆసాముల ఇళ్ళన్నీ తిరిగాడు పరుగులాంటి నడకతో, కాని ఏం లాభం? ఆవు పాడిగల శిరిగల యిళ్ళల్లో పాలల్లో తోడేసి నిద్రలు పోతున్నారు. అక్కడకూ ఓ దయగల ఆసామి మళ్ళీ దూడను విడిచి చూశాడు. చేతిలోని చెంబు కుడితి తొట్లో పడేట్టు తన్నింది ఆవు.

ఎల్లమంద నిరాశతో ఇంటిముఖం పట్టాడు. మగతలో ఎగిరెగిరి పడుతోన్న పసివాడు కళ్ళల్లో కదిలాడు.

ఒక్కగానొక్క బిడ్డ! ఎంతో కాలానికి కలిగిన బిడ్డ! తనకు కాకుండా పోతాడా? భార్యపోయిన దుఃఖాన్ని ఆ బిడ్డను చూసుకొనే కదా మర్చిపోగలుగుతున్నాడు!

ఓ గుక్కెడు ఆవుపాలకోసం తన బిడ్డ తనకు కాకుండా పోతాడా? బిడ్డ ప్రాణాలను కాపాట్టానికి గుక్కెడు ఆవుపాలను సంపాదించలేని తను బ్రతికెందుకు?

తండ్రి హృదయం తల్లడిల్లిపోసాగింది.

ఈ రాత్రి ఎలా గడపటం? ఎవరైనా తనకు ఓ ఔన్సు ఆవుపాలిస్తే? వాళ్ళకు తన సర్వస్వం ఇస్తాడు! జీవితం అంతా ఊడిగం చెయ్యమన్నా చేస్తాడు! తన ప్రాణాలు కావాలన్నా ఇస్తాడు!

హృదయంలో అగ్నిపర్వతాలు బద్దలయే శబ్దాలూ, సముద్ర ఘోషలూ, రైళ్ళు ఢీకొనడంలాంటివి అయాక, ఎల్లమంద మెదడులో, ఓ చిన్న ఊహ తళుక్కున మెరిసింది.

అంతే! రేచులా, గాలిలా, సుడిగాలిలా, తారాజువ్వలా, ఆ చీకట్లో చేలకడ్డంపడి, కంచెలుదాటి, కంపలుదాటి పరుగులు తీస్తున్నాడు ఎల్లమంద.

గోపాలపురం బందెలదొడ్డి దగ్గరకొచ్చి ఆగాడు. రొప్పుతూ. గేటుకు వేసివున్న పెద్ద తాళంకేసి జాలిగా చూశాడు.

నాలుగు గోడల మధ్యా అలజడిగా తిరుగుతోన్న ఎల్లావు కళ్ళబడింది.

ఎల్లమందకు పోతున్న ప్రాణాలు తిరిగివచ్చినై. ఎల్లావు ఎల్లమంద కళ్ళకు ప్రాణదాతలా కన్పించింది.

చివాలున గోడదూకి దొడ్లోకి వచ్చాడు. బుసలు కొడుతున్న ఎల్లావు గిర్రున తిరిగి ఎల్లమంద రొమ్ములో కొమ్ములు పెట్టింది.

ఎల్లమంద తన రెండు చేతుల్నీ ఎత్తి ఎల్లావు గంగడోలును నిమురుతూ "గోమాతా! నా బిడ్డను కాపాడు!" అని మనసులో ప్రార్థించాడు.

చల్లగా, మెల్లగా, లాలనగా, పొదుగులోకి చెయ్యి పోనిచ్చాడు.

బిడ్డకోసం తహతహలాడిపోతున్న గోమాత వళ్ళు పులకరించింది. పొదుగులో నుంచి పాలజల్లులు అమృతజల్లులై చిమ్మినై.

పాలభారంతో అలిసి, కదలిపోతున్న ఎల్లావు క్షీరవర్షాన్నే కురిపించింది.

ఎల్లావు తన తలనూ, చెంపల్నూ, చేతుల్నూ నాకుతోండగా, చెంబు నిండుగా పాలు పిండుకొన్నాడు ఎల్లమంద.

కృతజ్ఞతాభారంతో ఎల్లావును గోముగా నిమిరి పాలచెంబును తీసుకొని ఇంటివైపుకు పరుగుతీశాడు.

ఆవుపాల అనుపానంతో బిడ్డకు రెండుసార్లు మందు పోశాడు. పసివాడి ముఖం లోకి చూస్తూ కూర్చున్న ఎల్లమందకు కళ్ళు తెరచి బోసినవ్వుల్ని చిలకరించే బిడ్డ కన్పించాడు. ఎల్లమంద హృదయం ఆనందంతో పరవళ్లు తొక్కింది.

కాని...

ఎల్లమంద చెవులకు, తన గుండెలు నల్లరాతిమీద పడి పగిలిన కుండపెంకుల్లా విన్పించాయ్!

"అంబా! అంబా!" అల్లంత దూరాన లేగదూడ ఆర్తనాదం! అమ్మకోసం - పాలకోసం - ఆకలితో అలమటిస్తున్న లేగదూడ పిలుపులు బాణాల్లా - శూలాల్లా ఎల్లమంద చెవులకు నాటాయ్!

ఉన్నపాటున లేచి ఎల్లమంద రంగయ్యగారి దొడ్లోకి వచ్చి వాలాడు. చావిట్లో కట్టుగొయ్యకు పలుపు చుట్టుకొని-అమ్మకోసం... పాలకోసం అలమటిస్తోన్న లేగదూడను అమాంతంగా భుజాలమీద వేసుకొన్నాడు ఎల్లమంద. భుజాలమీద దూడతో ప్రహరీగోడ దూకి బయటపడ్డాడు.

అర్ధరాత్రి! భుజాలమీద బుల్లి బసవడు "అంబా! అమ్మా!" అని అరుస్తోంటే ఎల్లమంద కాళ్ళల్లోకి వెయ్యి లేపాక్షి బసవదేవుళ్ళ బలం తెచ్చుకొని వేగంగా మాగాటిచేల కడ్డంపడి, పంట కాలవ దాటి, గనెం దూకి, శ్రీరామచంద్రుడు విడిచిన బాణంలా వచ్చి గోపాలపురం బందెలదొడ్డిముందు వాలాడు.

గోడదూకి లేగదూడను తల్లిముందు వదిలాడు. లేగదూడ ఆత్రంగా తల్లి పొదుగులో తలదూర్చింది. ఎల్లమంద సంతృప్తిగా చూశాడు.

ఎల్లావు ఆప్యాయంగా బిడ్డను గోముగా నాకుతూ పాలు కుడుపుతుంటుంటే ఎల్లమంద కళ్ళు చెమ్మగిల్లాయి. మనస్సు చిత్తడినేల అయింది.

తెల్లవారిందాకా, గ్రామాధికారి ఇంటిముందు పడిగాపులు కాచి, ఎల్లమంద ఆవుకూ, దూడకూ చెల్లించవలసిన శుల్కం చెల్లించి తల్లినీ, బిడ్డనూ విడిపించాడు.

దారిలో తన చేను దగ్గర ఆగి, ఓ మోపెడు పిల్లిపెసర మేత కట్టుకుని తలమీద పెట్టుకొన్నాడు.

ఎల్లావునూ, లేగదూడనూ రంగయ్యగారి దొడ్లోకి తోలుకొచ్చి గాట్లో పిల్లిపెసర మోపు వేస్తోంటే ఎల్లావు ఎల్లమంద ముంజేతుల్ని నాకింది.

వెళ్ళిపోతున్న ఎల్లమందకేసి మోరచాచి చూసింది.

ఆ గోమాత చూపుల్లో ఎల్లమందకు తన పాలబుగ్గల పసిపాపడు బోసినవ్వుల్ని వెదజల్లుతూ కన్పించాడు.

అప్పటికింకా ఆసామి రంగయ్య నిద్ర లేవలేదు.

(3.4.1970 పొలికేక సచిత్ర వారపత్రిక)